క్లుప్తంగా

గాలి వాన బీభత్సం



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలో ఆదివారం సాయంత్రం బలమైన గాలులు వీయడంతోపాటు వర్షం కురిసింది. ఒక్కసారిగా గాలి దుమారం చెలరేగడంతో రోడ్డుకు ఇరువైపులా చెట్లు నెలకూలాయి. ఎస్సీ కాలనీలో 3 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని సర్పంచ్ యాకర మంజుల యాదగిరి మీడియాకు తెలిపారు. వర్షం తగ్గిన తర్వాత రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న స్తంభాలను తొలగించారు. స్తంభాలు విరిగిన వైపు విద్యుత్ సరఫరా నిలపేసి రాత్రి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఎస్సైకి సన్మానం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో ఎస్సై వీరభద్రరావును సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. ఎస్సైగా వీరభద్రరావు శాంతిభద్రతల పరిరక్షణలో ఎనలేని సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలున్నా పోలీసులను నేరుగా సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టవర్ పైనుంచి పడి వలస కూలీ మృతి

కమలాపూర్ : ప్రమాదవశాత్తు విద్యుత్ టవర్ పైనుంచి పడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కూలీ రణధీర్ కుమార్ (25) ఆదివారం మృతి చెందాడు. ఎస్సై ఎం.సతీష్ కథనం ప్రకారం.. గతనెల 27న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు విద్యుత్ టవర్ పనుల కోసం మండలంలోని భీంపల్లికి వచ్చారు. పనులు చేయడానికి ఆదివారం టవర్‌పైకి ఎక్కిన ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లా సుగోలిపూర్‌కు చెందిన రణధీర్ కుమార్ తాడు తెగిపోవడంతో టవర్‌పై నుంచి కింద పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడ్ని చికిత్స కోసం 108 ద్వారా హుజూరాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుని పెదనాన్న సంజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



అబ్బాస్ (ఫైల్)

దామెర : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఒగ్లాపూర్ గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన మహ్మద్ అబ్బాస్ (23) శనివారం వ్యక్తిగత పనుల నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వెళ్లి అర్ధరాత్రి పసరగొండకు తిరిగి బయల్దేరాడు. ఈ క్రమంలో ఒగ్లాపూర్ సమీపంలోని పవర్ గ్రిడ్ వద్ద 163వ నంబర్ జాతీయ రహదారిపై వెనక నుంచి వస్తున్న మరో వాహనం అబ్బాస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబ్బాస్ తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ముందు వెళ్తున్న వాహనం నిలవగా తాను సైతం ద్విచక్ర వాహన వేగాన్ని తగ్గించడంతో వెనుక నుంచి మరో వాహనం వచ్చి ఢీకొట్టిందని తెలుస్తోంది. అబ్బాస్ తండ్రి అంకూస్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి..



నవీన్ (ఫైల్)

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి మేడిపెల్లి నవీన్ (21) ఈనెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై ఎం.సతీష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నవీన్ పెయింటింగ్ పనులు చేస్తూ డిగ్రీ సెకండియర్ చదివాడు. పరీక్షల్లో పాసవుతానో లేదోనని ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుని తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్పీ బాలుకు నివాళి

హన్మకొండ: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతిని హనుమాన్‌నగర్ -1లో ఆదివారం నిర్వహించారు. బాలు చిత్రపటానికి కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మనోహర్, సాధుల రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు : మాట్లాడుతున్న సీపీ ఏవీ.రంగనాథ్



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్



శాయంపేట : మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

● వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

ఐనవోలు : బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తోందని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) ఏవీ.రంగనాథ్ స్పష్టం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పర్వతగిరి సీఐ శ్రీనివాస్ అధ్యక్షతన మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సురక్షా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బాధితులకు అండగా నిలవడానికి ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే పోలీసులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో, ప్రజాప్రతినిధులతో మమేకమై ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల రక్షణకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి, ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత్, డీసీపీ పుల్లా కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

షీ టీంలతో మహిళల భద్రత

శాయంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీంలు ఏర్పాటు చేసి మహిళలకు భద్రత కల్పించిందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమైక్య పాలనలో ప్రజలు పోలీసులంటేనే భయపడే వారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక పోలీసు శాఖను ప్రజలకు చేరువ చేశామని, అనేక సంస్కరణలతో పేదలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమలో ఏసీపీ శివరామయ్య, సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, తహసీల్దార్ రాజు, ఎస్సై వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పరకాల : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



నడికూడ : మాట్లాడుతున్న ఏసీపీ శివరామయ్య



ఆత్మకూరు : మాట్లాడుతున్న సీఐ కుమార్



దామెర : మాట్లాడుతున్న ఎస్సై రాజేందర్

పోలీసుల సేవలు ఆదర్శప్రాయం

పరకాల : తెలంగాణలో పోలీసుల సేవలు ఆదర్శప్రాయమని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో సీఐ పుల్యాల కిషన్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు అందిస్తున్న స్నేహహస్తానికి ప్రజల నుంచి ఎనలేని స్పందన వస్తోందన్నారు. ఎంపీపీ టి.స్వర్ణలత మాట్లాడుతూ నేర రహిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిలువేరు మొగిలి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, ఎస్సై ప్రశాంత్‌బాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

నడికూడ : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్టు ఏసీపీ జూపల్లి శివరామయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ పుల్యాల కిషన్, ఎస్సై ప్రశాంత్ బాబు, ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ కొడెపాక సుమలత, సర్పంచ్ రవీందర్ రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చందు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, నీరుకుళ్ల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమానికి సీఐ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం పోలీస్ శాఖలో అనేక మార్పులొచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, సర్పంచ్ బలరామ్, భగవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామెర : దామెర, పులుకుర్తి, తక్కళ్లపహాడ్, ఊరుగొండ గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎస్సై ముత్యం రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఏఎస్సై రాజు, ఎంపీటీసీ గండు రాము, సర్పంచ్‌లు రాజేశ్వరి ఈశ్వర్, రాజేందర్, అశోక్, ఉపసర్పంచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఏజీఎఫ్ సేవలు

ఐనవోలు : ప్రజలకు అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ (ఏజీఎఫ్) ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నట్టు బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలకు చెందిన వీఓఏలకు ఎమ్మెల్యే అరూరి రమేష్-కవిత కుమారి దంపతులు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీలు మధుమతి, కమల, అప్పారావు, జెడ్పీటీసీ సునీత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, వైస్ ఎంపీపీ రత్నాకర్, రైతుబంధు మండల కోఆర్డినేటర్లు విజయ్, శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

● టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణ

శాయంపేట : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ సభ్యుడు, ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కర్ణాటక ఫలితాలు పునరావృతమౌతాయని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలూ వంచనకు గురవుతున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక మోసపూరిత హామీలు గుప్పించి ఓట్లు దండుకుని గద్దెనెక్కి ప్రజలను విస్మరించి దుష్టపాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కాయని తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన, పేదలకు సుపరిపాలన అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పాలనతో విసిగిన ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమౌతూ కాంగ్రెస్ హయాంలో అమలైన పథకాలను వివరించాలని సూచించారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూదిపాల బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మారెపెల్లి క్రాంతి, పోతు కృష్ణమూర్తి, నిమ్మల రమేష్, ప్రధాన కార్యదర్శులుగా హైదర్, మారెపెల్లి రవీందర్, హింగె భాస్కర్, అధికార ప్రతినిధిగా చిందం రవి, కోశాధికారిగా శానం కుమారస్వామి, ప్రచార కార్యదర్శిగా కూకిడి నాగేశ్వర్‌రావు, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా మారెపెల్లి రాజేందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా లడే రాజ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా స్వరూప, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడుగా కోగిల జగన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు వైనాల కుమారస్వామి, మహ్మద్ రఫీ, దుబాసి కృష్ణమూర్తి, మారెపెల్లి సాంబయ్య, రఫీ, నిమ్మల రమేష్, కుక్కల రమేష్, రాజు, ప్రకాశ్, కుమారస్వామి, బుజ్జన్న, రవి, రాజేందర్, కట్టయ్య, రమేష్, శ్రీను, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

విద్యతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు

● 'ముల్కనూర్' సొసైటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : విద్యతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి స్పష్టం చేశారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో ఎంసెట్-2020, 21, 22ల్లో ర్యాంక్ సాధించి మొదటి సంవత్సరంలో ప్రవేశం పొంది గతంలో ప్రోత్సాహక బహుమతి తీసుకోని 41 మంది విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రూ.5.07 లక్షల ప్రోత్సాహక బహుమతులు అందజేసి మాట్లాడారు. సొసైటీ సభ్యుల పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించే దిశగా బహుమతులు అందజేస్తూ ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రుల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. అనంతరం సివిల్స్‌లో ప్రతిభ చాటి ర్యాంక్ సాధించిన పత్తిపాక సాయికిరణ్‌ను జనరల్ మేనేజర్, కార్యవర్గ సభ్యులతో కలిసి ప్రవీణ్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● 'బడిబాట'లో హెచ్‌ఎం మనోహర్‌నాయక్

ఎల్కతుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని బావుపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మనోహర్‌నాయక్ తెలిపారు. బడిబాటలో భాగంగా మండలంలోని బావుపేటలో జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూళ్ల ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి హెచ్‌ఎం మనోహర్‌నాయక్ మాట్లాడారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కలిసి ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన అందిస్తారని, ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, యూనిఫారంతోపాటు అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. 1 నుంచి 9వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తున్నట్టు చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, వసతులు అందుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు వాసంతి, ప్రసూన, సునీత, రవికుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజలను కలుస్తూ బడి ఈడు పిల్లల గురించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా 8 మంది విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, విద్యానంద్, వీరయ్య, రాజన్న, పోతుల ఉమాదేవి, స్వరూప, రాధిక, తబిత తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



ధర్మసాగర్ : విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాల కులస్తుల అభివృద్ధికి కృషి

కాజీపేట అర్బన్: మాల కులస్తుల అభివృద్ధికి సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటలో ఆదివారం భీమ్ మాల పరస్పర సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. మాల సంఘ భవన నిర్మాణానికి స్థల సేకరణలో వెంకటమల్లు పాత్ర మరువలేనిదని కొనియాడారు. భీమ్ మాల పరపతి సంఘం సభ్యత్వం వెయ్యికి చేరుకున్న తరుణంలో తన వంతు సాయం అందజేస్తానని తెలిపారు. మాల కులస్తులు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రైతురుణ విముక్తి కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

రక్తదానం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, జాగృతి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ఆదివారం రక్తదానం చేశారు. రేగొండ మండలంలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన మాదాసు కుమారస్వామికి శస్త్రచికిత్స సందర్భంగా రక్తం అవసరం ఉండగా అశోక్ స్పందించారు. వరంగల్‌లోని మదర్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఇప్పటివరకు తాను 34 సార్లు రక్తదానం చేసినట్టు తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి

పరకాల : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి 'గడప గడపకు.' యాత్రను ఆదివారం ఆయన ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, వైఫల్యాలపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసాచారి మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకొని స్థానికేతరుడైన ధర్మారెడ్డి దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. తొలుత శ్రీనివాసాచారితోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి పుల్లయ్య, రాష్ట్ర సీనియర్ నాయకుడు గట్టు ప్రసాద్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి అజ్మీర రాజునాయక్, రాష్ట్ర కార్యదర్శి బాబా ఖాదర్ అలీ, తెలుగునాడు అనుబంధ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాజం, తదితరులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం డప్పుచప్పుళ్లు, కోలాట నృత్యాలతో అమరధామం చేరుకుని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిదురాల రామన్న, పల్లెబోయిన రవి, సుంకరి దిలీప్‌కుమార్, నల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసాచారి

20న గిరిజనుల 'చలో హైదరాబాద్'

హన్మకొండ చౌరస్తా: గిరిజన రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన గిరిజన ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కువద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్ తెలిపారు. ఈమేరకు హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో మహాధర్నా కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో సాధించిన 10శాతం గిరిజన రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ చేర్చి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 11 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించిన ముసాయిదాను కేంద్రం తిరస్కరించాలని, జీఓ నంబర్ 3, 1/70 చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల అధ్యక్షులు అజ్మీరా వెంకట్, బానోత్ సునీల్ నాయక్, బానోత్ వసంత్, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల ఇన్‌చార్జ్‌లు అజ్మీరా పూల్‌సింగ్, జాటోత్ బాలు, అజ్మీరా పడినాయక్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ విజయోత్సవాలు

పరకాల : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో నేడు (సోమవారం) విద్యుత్ విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జ్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) సాంబరెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) గజ్జెల సత్యనారయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి పట్టణంలోని రైతులు, వినియోగదారులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టెన్త్ టాపర్లకు 'ఆర్యవైశ్య' మండలి సన్మానం

వరంగల్ చౌరస్తా: పదవ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులను ఆర్యవైశ్య మిత్ర మండలి ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఆర్యవైశ్య మిత్ర బృందం కార్యాలయంలో సోమవారం సత్కరించి, ప్రశంస పత్రాలు పంపిణీ చేసి, మెడల్స్ అందజేశారు. అలాగే, ఉచిత కంప్యూటర్ శిక్షణ తీసుకున్న 60మందికి పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్ర బృందం జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్, నాయకులు పళ్ల పరమేశ్వర్, యాద రవికుమార్, చిన్నాల సురేష్, రవిబాబు, అల్లాడి వీరభద్రయ్య, పాల సత్యనారాయణ, శ్రీరామ్ శ్రీనివాస్, సోమ అశోక్, రేపాలహరి, సందీప్, హరిణి, లిఖిత, అంజలి, యాద రజిత, రవికుమార్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాల అందజేత

విద్యారణ్యపురి: జిల్లాలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీపీ, మోడల్ స్కూళ్లలో టెన్త్ పరీక్షల ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు, మండల టాపర్లు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి ఆదివారం తెలిపారు. ఈనెల 5న ఉదయం హనుమకొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, విశిష్ట అతిథులుగా, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రేపు కాంట్రాక్టు లెక్చరర్ల సదస్సు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో కాంట్రాక్టు లెక్చరర్ల సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ తెలిపారు. సదస్సుకు కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మహ్మద్ ఇక్బాల్‌అలీ హాజరవుతారని తెలిపారు. ఈమేరకు హనుమకొండలో ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తిని ఆదివారం కలిసి సదస్సును విజయవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. మాజీ వీసీని కలిసిన వారిలో కేయూ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం బాధ్యులు ఆర్‌డీ.ప్రసాద్, టీ.నాగయ్య, చందులాల్, మధుకర్‌రావు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.